హరితహారానికి సిద్ధం

- మండలంలో 32 నర్సరీలు
- 1.60 లక్షల మొక్కలు నాటేందుకు చర్యలు



బొల్లంపల్లిలో నర్సరీలో మొక్కలకు నీరు అందిస్తున్న కూలీ



వెల్దండలో గుంతలను తీస్తున్న కూలీలు

వెల్దండ: వానాకాలంలో నిర్వహించనున్న హరిత హారం కార్యక్రమానికి అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. నిర్దేశించిన లక్ష్యం మేరకు ప్రణాళికాబద్ధంగా ముందుకు వెళ్తున్నారు. గ్రామాల్లో ఏర్పాటు చేసిన నర్సరీలను ఎప్పటికప్పుడు అధికారులు పర్యవేక్షిస్తున్నారు. మొక్కలు ఎండకుండా నిర్వాహకులకు పలు సూచనలు, సలహాలు ఇస్తున్నారు. హరితహారంలో భాగంగా మొక్కలు నాటేందుకు సర్వ సిద్ధం చేశారు. మండలంలోని మొత్తం 32 గ్రామ పంచాయతీల్లో ప్రతి నర్సరీల్లో మొక్కలు సిద్ధంగా ఉంచారు. ఇటీవల కురిసిన వర్షాలకు ఉపాధి హామీ కూలీలకు మొక్కలు నాటేందుకు గుంతలను తీస్తున్నారు. గతంలో నాటిన మొక్కలను రక్షించడానికి ఎంతో కృషి చేస్తున్నారు. వాటర్ ట్యాంకర్ల ద్వారా మొక్కలకు నీరు అందిస్తున్నారు.

1.60 లక్షల మొక్కలు సిద్ధం

ఈ ఏడాదిలో హరితహారంలో మొక్కలను నాటేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు అధికారులు పేర్కొన్నారు. మండలంలోని మొత్తం 32 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. ప్రతి పంచాయతీలోని 5 నుంచి 10 వేల మొక్కలు పెంచుతున్నట్లు అధికారులు పేర్కొన్నారు. మండలానికి జిల్లా అధికారులు 1.60 లక్షల మొక్కలు నాటించాలని లక్ష్యాన్ని నిర్దేశించారు. రైతులకు ఉపయోగపడే విధంగా నర్సరీలల్లో మొక్కలు పెంచుతున్నారు. ఇటీవల వర్షాలు కురవడంతో వెల్దండ, చెర్కూర్, చెదురుపల్లి, బొల్లంపల్లి, కొట్ర, పెద్దాపూర్, కుప్పగండ్ల తదితర గ్రామాల్లో మొక్కలు నాటేందుకు సర్వ సిద్ధం చేశారు. రోడ్లకు ఇరువైపులా, రైతుల వ్యవసాయ పొలాల గట్ల వెంబడి మొక్కలను నాటేందుకు గుంతలను తీస్తున్నారు.

లక్ష్యాన్ని చేరుకుంటాం



ఉన్నతాధికారులు నిర్దేశించిన లక్ష్యాన్ని చేరుకుంటాం. మండలంలోని 32 గ్రామ పంచాయతీలల్లో మొత్తం 1.60 లక్షల మొక్కలను నాటేందుకు చర్యలు తీసుకుంటున్నాం. కొన్ని గ్రామాల్లో జాతీయ ఉపాధి హామీ కూలీలకు గుంతలను ఏర్పాటు చేశాం. వర్షాలు వచ్చిన వెంటనే జిల్లా అధికారుల ఆదేశాల మేరకు మొక్కలను నాటిస్తాం. మొక్కలు అందుబాటులోని గ్రామాల్లో ఇతర గ్రామాల నుంచి మొక్కలను సరఫరా చేసి హరిత హారం కార్యక్రమాన్ని విజయవంతం చేస్తాం.

– ఈశ్వర్‌జీ, ఏపీఓ, వెల్దండ

వైభవంగా నర్సింహస్వామి కల్యాణం



వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే కసిరెడ్డినారాయణరెడ్డిని సన్మానిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

కల్వకుర్తిరూరల్: మండలంలోని కుర్మిద్దలో వెలసిన నర్సింహస్వామి దేవాలయంలో బుధవారం నర్సింహస్వామి కల్యాణోత్సవం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. సుప్రభాతంలో ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. ఎమ్మెల్యే కసిరెడ్డినారాయణరెడ్డి ఉత్సవాలలో పాల్గొని నర్సింహస్వామికి ప్రత్యేక పూజలు చేశారు. ప్రతి ఒక్కరు భక్తిభావంతో మెలగాలని కోరారు. బొడ్రాయి వార్షిక ఉత్సవాలకు హాజరయ్యాయి. ఆలయ చైర్మన్ కృష్ణారెడ్డి ఎమ్మెల్యేను సత్కరించారు. మాజీ సర్పంచ్‌లు ఆనందర్, దామోదర్‌గౌడ్, శేఖర్, రాజేష్‌రెడ్డి, మాజీ ఉప సర్పంచ్ విజయ్‌భాస్కర్, గ్రామస్తులు పాల్గొన్నారు.

మొక్కల సంరక్షణ అందరి బాధ్యత



మాధవస్వామినగర్‌లో నర్సరీని పరిశీలిస్తున్న డీఆర్‌డీఓ చిన్న ఓబులేష్

పెంట్లవెల్లి: మొక్కల సంరక్షణ అందరి బాధ్యత అని డీఆర్‌డీఓ చిన్న ఓబులేష్ అన్నారు. బుధవారం మండలంలోని మాధవస్వామినగర్‌లో పల్లెప్రకృతి వనాన్ని, నర్సరీని ఆయన ఆకస్మికంగా సందర్శించారు. నిర్వాహకులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. అదేవిధంగా పల్లెప్రకృతి వనాన్ని పరిశీలించారు. మొక్కలు ఎండకుండా చర్యలు తీసుకోవాలని పంచాయతీ సెక్రెటరీ శ్రావణ్‌కు సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ప్రసన్నకుమారి, ఏపీఓ మోహన్‌కృష్ణ, రాము పాల్గొన్నారు.

మంత్రిపై అసత్య ఆరోపణలు సరికాదు



మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

పెంట్లవెల్లి: చిన్నంబావి మండలం లక్ష్మిపల్లిలో శ్రీధర్‌రెడ్డిని గుర్తుతెలియని వ్యక్తులు హత్య చేస్తే బీఆర్‌ఎస్ నాయకులు స్థానిక మంత్రి జూపల్లి కృష్ణారావుపై అసత్య ఆరోపణలు చేయడం సరికాదని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మదుగం నర్సింహయాదవ్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మంత్రి జూపల్లిని రాజకీయంగా ఎదుర్కోలేక మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి హత్యా రాజకీయాలకు తెరలేపారని విమర్శించారు. శ్రీధర్‌రెడ్డి హత్యకేసులో మంత్రి ప్రమేయం లేకున్నా రాజకీయదురుద్దేశ్యంతోనే ఆరోపణలు చేస్తున్నారన్నారు. తప్పుడు ప్రచారాలు మానుకోకపోతే తగిన బుద్ధి చెప్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ గోవింద్‌గౌడ్, వైస్ ఎంపీపీ భీంరెడ్డి, మాజీ సర్పంచ్ గోపాల్, రామన్‌గౌడ్, నర్సింహనాయుడు, తిరిగిరి గోపాల్, శంకర్, కబీర్, ఎర్ర శీను, ఆంజనేయులు, శేషాంద్రప్రసాద్, హుసేన్, నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అధికారుల సూచనలు పాటించాలి



తాడూరు మండలం శిర్సవాడలో మాట్లాడుతున్న డీఏఓ చంద్రశేఖర్



లింగాల మండలం అప్పాయిపల్లిలో

తాడూరు: అధికారుల సూచనలు, సలహాలు రైతులు పాటించాలని జిల్లా వ్యవసాయ అధికారి చంద్రశేఖర్ అన్నారు. బుధవారం మండలంలోని శిర్సవాడలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి రైతు తప్పనిసరి లైసెన్స్ ఉన్న డీలర్ దగ్గరనే విత్తనాలు కొనుగోలు చేయాలని కోరారు. రశీదును పంటకాలం పూర్తయ్యేవరకు భద్రంగా ఉంచుకోవాలన్నారు. కాలపరిమితి చూసి విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేయాలన్నారు. సమావేశంలో ఏఓ సాయిరమేష్‌కుమార్, మాజీ సర్పంచ్ రాజేందర్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

నాగర్‌కర్నూల్‌రూరల్: నాణ్యమైన విత్తనాలు కొనుగోలు చేయాలని ఏఓ నర్మద రైతులకు సూచించారు. బుధవారం మండలంలోని పలు గ్రామాల్లో నిర్వహించిన రైతు సదస్సులో ఆమె పాల్గొని మాట్లాడారు. విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేస్తే తప్పనిసరిగా రశీదు పొందాలన్నారు. డీలర్లు నిబంధనలు పాటించాలని కోరారు. కార్యక్రమంలో ఏఈఓలు పాల్గొన్నారు.

లింగాల: మండలంలోని అప్పాయపల్లి, శ్రీరంగాపూర్‌లో రైతులకు నిర్వహించిన సమావేశానికి మండల వ్యవసాయాధికారి నాగార్జునరెడ్డి హాజరై మాట్లాడారు. విత్తనాల వాడకంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. విడి విత్తనాలను కొనుగోలు చేయొద్దన్నారు. కార్యక్రమంలో ఏఈఓ మానస, పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్వర్లు, శకుంతల, రైతులు పాల్గొన్నారు.

బిజినేపల్లి: మండలంలోని నందివడ్డెమాన్, శాయిన్‌పల్లి గ్రామాల్లోని రైతులకు విత్తనాల కొనుగోలుపై ఏడీఏ రమేష్‌బాబు అవగాహన కల్పించారు. అనంతరం మండల కేంద్రంలోని సాయి ట్రేడర్స్, గౌతమి సీడ్స్ దుకాణాల్లో విత్తన నమూనాలు సేకరించి వాటిని ల్యాబ్‌కు పంపించనున్నట్లు హో నీతి తెలిపారు. అదేవిధంగా మండలంలోని ఆవంచ, రాళ్ళ చెరువు తండా, బాజీపూర్, మారేపల్లి, కోడుపర్తి, అప్పాజిపల్లి, ఇప్పలపల్లి గ్రామాల్లో విత్తనాల కొనుగోలు సమయంలో రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై తిమ్మాజిపేట ఏఓ కమల్‌కుమార్ అవగాహన కల్పించారు. ఏఈఓలు ఫరీద్‌పాషా, సాయిరాం, శివసాగర్, అబ్దుల్లా నవాజ్, శేఖర్, సంతోష, సాయిత, మధు, శాయిన్‌పల్లి ఎంపీటీసీ చిన్నారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పెద్దకొత్తపల్లి: మండల కేంద్రంలోని పోలీసు స్టేషన్‌లో ఎరువుల దుకాణాల యజమానులతో వ్యవసాయ శాఖ, పోలీసు శాఖల ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ అధికారి శ్రీరాం మాట్లాడుతూ డీలర్‌లు విత్తనాలు, ఎరువులు, పురుగుల మందులు రైతులు కొనుగోలు చేసినప్పుడు బిల్లులు ఇవ్వాలని సూచించారు. రైతులు క్రిమిసంహారక మందులు పిచికారి చేసేముందు ఆయా గ్రామాలలో ఉన్న ఏఈఓలతో సూచనలు, సలహాలు తీసుకొని వారు సిఫారస్ చేసిన పురుగుల మందులనే వాడాలని ఆయన సూచించారు. జీలుగ విత్తనాలు అందుబాటులో ఉన్నాయన్నారు. ఎస్‌ఐ సతీష్ ఏఈఓలు ముజీద్, జానకిరాం పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం



బాధిత కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే మర్రిజనార్దన్‌రెడ్డి



కల్వకుర్తి మండలం జిల్లెల్లలో ఆర్థికసాయం అందిస్తున్న మాజీ సర్పంచ్ రాములు

కల్వకుర్తిరూరల్: మండలంలోని జిల్లెల్ల గ్రామానికి చెందిన దివ్యాంగుల హక్కుల సంఘం నాయకుడు కృష్ణయ్య ఇటీవల మృతి చెందాడు. బుధవారం జిల్లెల్ల మాజీ సర్పంచ్ రాములు రూ.40 వేలు, గ్రామస్తులు రూ.30 వేలు ఆర్థికసాయాన్ని అందజేశారు. కార్యక్రమంలో హనుమాన్ దేవాలయ చైర్మన్ రవిగౌడ్, వైస్ చైర్మన్ శ్యాంసుందర్‌రెడ్డి, నాయకులు బాల్‌జంగయ్య, మహేందర్, కృష్ణ, బాల్‌జంగయ్య, తదితరులు పాల్గొన్నారు.

వెల్దండ: మండలంలోని కంటోనిపల్లి గ్రామానికి చెందిన మల్లేష్‌గౌడ్ ఇటీవల మృతి చెందాడు. బుధవారం బాధిత కుటుంబాన్ని మాజీ సర్పంచ్ పెద్ది రామకృష్ణ పరామర్శించి రూ.5వేల ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్ సురేందర్, మాజీ వార్డు సభ్యులు జంగయ్య, సుదర్శన్, ఆంజనేయులు, అంజయ్య ఉన్నారు.

తెలకపల్లి: మండలంలోని చిన్నముద్దునూర్ గ్రామానికి చెందిన పర్వపాకుల నారాయణ ఇటీవల గుండెపోటుతో మృతిచెందాడు. ఈ విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే మర్రిజనార్దన్‌రెడ్డి బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి రూ.10 వేల ఆర్థికసాయం అందజేశారు. మాధవరెడ్డి, శ్రీనివాసులు, వెంకటయ్య, సత్యనారాయణ, కాశీం తదితరులు ఉన్నారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వం ధ్యేయం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాజేష్‌రెడ్డి

తాడూరు: రైతు సంక్షేమమే ప్రభుత్వం ధ్యేయమని ఎమ్మెల్యే కూచుకుళ్ల రాజేష్‌రెడ్డి అన్నారు. బుధవారం సింగిల్‌విండో నూతన అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన రామచంద్రారెడ్డి సన్మాన కార్యక్రమానికి ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ దామోదర్‌రెడ్డి హాజరయ్యారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ విండో చైర్మన్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం సంతోషకరమన్నారు. రైతుల ఆర్థిక అభివృద్ధికి తోడ్పాటు అందించాలన్నారు. రైతులకు ఇచ్చిన హామీలు నెరవేర్చుతామన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి రైతుల పక్షపాతి అని పేర్కొన్నారు. నూతన చైర్మన్ పనిచేసి రైతులను కాపాడాలని కోరారు. ఎమ్మెల్సీ దామోదర్‌రెడ్డి మాట్లాడుతూ స్వలాభం కోసం కాకుండ రైతుల ప్రయోజనాల కోసమే పనిచేయాలని సూచించారు. రైతులకు సకాలంలో అందించాలన్నారు. ఎంపీటీసీ రోహిణి, సందరేణుక, భగవంత్‌రెడ్డి, సింగిల్‌విండో సిబ్బంది మధుసూదన్, సందీప్, సీఈఓ ఆంజనేయులు, గోవర్ధన్‌రెడ్డి, మల్లయ్య, డైరెక్టర్లు రమేష్, కృష్ణయ్య, ఆయా గ్రామాల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలు విక్రయిస్తే చర్యలు



కొండనాగుల పీఏసీఎస్ విత్తన దుకాణంలో తనిఖీ చేస్తున్న వ్యవసాయశాఖ స్క్వాడ్ బృందం

బల్మూర్: నకిలీ విత్తనాలు విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని ఏడీఏ కిరణ్‌కుమార్ హెచ్చరించారు. బుధవారం మండలంలోని కొండనాగుల, బల్మూర్ గ్రామాల్లో ఫర్టిలైజర్ దుకాణాలను ఏడీఓతో పాటు వ్యవసాయశాఖ స్క్వాడ్‌బృందం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు విత్తనాలు కొనుగోలు చేసేటప్పుడు రసీదులో విత్తన రకం, లాట్ నెంబర్, ధర, పరిమాణం సరిచూసుకోవాలని తెలిపారు. ఏఓ టెక్నికల్ పల్లవి, ఏఓ మహేష్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.



అచ్చంపేటలో

అచ్చంపేట రూరల్: ఎరువులు, విత్తనాలను రైతులకు అధిక రేట్లకు విక్రయిస్తే డీలర్లపై చర్యలు తీసుకుంటామని మండల వ్యవసాయాధికారి కృష్ణయ్య హెచ్చరించారు. పట్టణంలోని పలు ఫర్టిలైజర్ దుకాణాలను ఎస్‌ఐ రాములుతో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు.

చారకొండ: మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో ఉన్న ఫర్టిలైజర్ దుకాణాలను ఏఓ చిన్న హుస్సేన్‌తో కలిసి ఏడీఏ రామావత్ రవి తనిఖీ చేశారు. డీలర్లకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఏఈఓలు రేణుక, వంశీ, డీలర్లు ఉన్నారు.

ఫోన్ ట్యాపింగ్‌పై కఠిన చర్యలు తీసుకోవాలి



మాట్లాడుతున్న ఎస్టీ సెల్ మండల అధ్యక్షుడు రాజేంద్ర ప్రసాద్

మన్ననూర్: ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ ఫోన్‌ను ట్యాపింగ్ చేసిన అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని అమ్రాబాద్ మండల కాంగ్రెస్ ఎస్టీ సెల్ అధ్యక్షుడు దాసరి రాజేంద్రప్రసాద్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా మన్ననూర్‌లోని ఓం చౌరస్తాలో పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. గత బీఆర్‌ఎస్ పాలకులు మళ్లీ అధికారంలోకి రావాలనే అక్కసుతో ముఖ్యమైన నాయకుల ఫోన్లు ట్యాపింగ్ చేయడం దుర్మార్గమన్నారు. ఫోన్ ట్యాపింగ్‌కు పాల్పడిన మాజీ ఎమ్మెల్యే గువ్వల బాల్‌రాజ్‌పై చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీటీసీలు రహీం, శ్రీనివాసులు, జిల్లా నాయకుడు వెంకటరమణ, శివాజీ, తుల్చ, కృష్ణయ్య, గోపాల్‌రెడ్డి, రెహమాన్, చరణ్ తదితరులు పాల్గొన్నారు.

వేసవి అలవెన్స్‌ల కోసం ఉద్యమిద్దాం

వీపనగండ్ల: ఉపాధి కూలీలకు వేసవి అలవెన్స్‌ను చెల్లించాలని ఎన్నో రోజులుగా విజ్ఞప్తి చేస్తున్నా ప్రభుత్వం స్పందించడం లేదని, సమైక్య పోరాటాల ద్వారానే ఉపాధి కూలీల హక్కులు సాధించొచ్చని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యాదర్శి ఆంజనేయులు అన్నారు. బుధవా రం తూంకుంట, బొల్లారం గ్రామాల్లో ఉపాధి కూలీలతో కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నా రు. తీవ్రమైన ఎండల్లో పనిచేస్తున్న కూలీలకు నీడ వసతులు, పనిముట్లకు అవసరమైన పారితోషికం అందివ్వాలని విజ్ఞప్తి చేసిన అధికారులు స్పందించడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. జిల్లాలోని ఉపాధి కూలీల సమస్యల పరిష్కారం కోసం జూన్ 6వ తేదీన కలెక్టర్ కార్యాలయం ఎదుట వందలాది ఉపాధి కూలీల ఆధ్వర్యంలో ధర్నా చేపడతామన్నారు. ఉపాధి కూలీలంతా పాల్గొని తమ గొంతు వినిపించాలని పిలుపునిచ్చారు. నర్సింహాగౌడ్, రజిత ఉన్నారు.

అన్నదానానికి బియ్యం వితరణ

కల్వకుర్తిరూరల్: పట్టణంలోని భగీరథ దేవాలయం ప్రాంగణంలో గురువారం మహారుద్ర హోమం నిర్వహించనున్నారు. అన్నదానం కోసం బుధవారం లయన్స్‌క్లబ్ కల్వకుర్తి ఆధ్వర్యంలో నిర్వాహకులకు 50 కేజీల బియ్యాన్ని అందించారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ కల్వకుర్తి అధ్యక్షుడు రమేష్, కార్యదర్శి రమేష్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

హౌసింగ్ సొసైటీ అధ్యక్షుడిగా శ్రీనివాసులు

అచ్చంపేట రూరల్: జర్నలిస్టు కో–ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ పట్టణ అధ్యక్షుడిగా బండారు శ్రీనివాసులును సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకునట్లు బుధవారం అసిస్టెంట్ ఎన్నికల రిటర్నింగ్ అధికారి భాగ్యమ్మ తెలిపారు. పట్టణంలోని ప్రెస్ క్లబ్ భవనంలో ముందుగా 11 మంది డైరెక్టర్లుగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శిగా కాలురి శ్రీనివాసులు, కోశాధికారిగా దూమర్ల భాస్కర్, ఉపాధ్యక్షుడిగా బాణాల శ్రీనివాసులును ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. జూనియర్ ఇన్‌స్పెక్టర్స్ మహమ్మద్ కుతుబుద్దీన్, సబిత, సభ్యులు పాల్గొన్నారు.

బాధితుడికి సెల్‌ఫోన్ అప్పగింత



ఊర్కొండ: మండలంలోని రామ్ రెడ్డి పల్లి గ్రామానికి చెందిన కదారి చంద్రధర్ యాదవ్ ఫోన్ పోగొట్టుకుపోవడంతో బుధవారం మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు పోలీసులు అత్యాధునిక టెక్నాలజీని వినియోగించుకొని గంట వ్యవధిలోనే ఫోన్ని ట్రేస్ చేశారు. దీంతో బాధితుడికి ఎస్‌ఐ వీరబాబు సెల్‌ఫోన్ అప్పగించారు. పోలీసు సిబ్బంది ప్రశాంత్, తిరుపతయ్య ఉన్నారు.

అధ్వానంగా బీటీ రోడ్లు



నాగులపల్లి నుంచి తుర్కదిన్నె వెళ్లే రోడ్డు

కోడేరు: మండలంలోని ముత్తిరెడ్డిపల్లి వాగు నుంచి కదిరేపాడ్‌కు పదేళ్ల కిందట బీటీ రోడ్డు నిర్మించారు. ప్రస్తుతం ఈ రోడ్డు అధ్వనంగా తయారైంది. కంకర తేలడంతో ప్రయణికుల రాకపోకలకు ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఆయా గ్రామాల ప్రజలు ప్రమాదాలబారిన పడుతున్నారు. ఆస్పత్రులకు వెళ్లేందుకు నరక యాతన అనుభవిస్తున్నామని స్థానికులు వాపోతున్నారు. అదేవిధంగా నాగులపల్లి నుంచి తుర్కదిన్నె వరకు ఉన్న బీటీ రోడ్డు అస్తవ్యస్తంగా తయారైంది. గుంతలమయంగా దర్శనమిస్తోంది. తుర్కదిన్నె క్రాస్ రోడ్డు నుంచి రాజాపూర్ వెళ్లే రోడ్డుకు ఐదేళ్ల కిందట డస్ట్ వేసి అలాగే వదిలేశారు. రాజాపూర్ గ్రామ పంచాయతీ నుంచి రేకులపల్లి తండా గ్రామపంచాయతీ వరకు డస్ట్ వేసి పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు ప్రజా ప్రతినిధులు స్పందించి రోడ్ల మరమ్మతుకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

క్లుప్తంగా

పండ్ల తోటల పెంపకానికి దరఖాస్తులు ఆహ్వానం

తెలకపల్లి: పండ్ల తోటలు సాగు చేసేందుకు ఔత్సాహికుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎంపీడీఓ కృష్ణయ్య బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఎంజీఎన్‌ఆర్‌సీజీఎస్ ద్వార పండ్ల తోటల సాగు నిమిత్తం దరఖాస్తులు చేసుకోవాలని కోరారు. 5 ఎకరాలలోపు భూమి కలిగి ఉండాలని, ఎస్సీ, ఎస్టీలకు 10 ఎకరాల భూమి కలిగి ఉన్న రైతులు అర్హులని వివరించారు. జాబ్‌కార్డు, భూమిపట్టా పాస్‌పుస్తకం, ఒర్జినల్ ఆర్‌ఓఆర్, భూమిలో నీటి వసతి ఉండాలని పేర్కొన్నారు.

సింగిల్ విండో చైర్మన్‌గా రామచంద్రారెడ్డి

తాడూరు: సింగిల్‌విండో చైర్మన్‌గా బుధవారం కే రామచంద్రారెడ్డి బాధ్యతలు చేపట్టారు. గతంలో చైర్మన్‌గా ఉన్న ఎండీ సమ్మద్‌పాషా రాజీనామా చేయడంతో కొంతకాలంగా వైస్ చైర్మన్ వెంకట్‌రెడ్డి చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించారు. అధికారులు ఈ నెల 29న కొత్త చైర్మన్ ఎంపిక కోసం తేదీ ఖరారు చేశారు. దీంతో 11 మంది డైరెక్టర్లు రామచంద్రారెడ్డిని ఏకగ్రీవంగా చైర్మన్‌గా ఎన్నుకున్నారు. చైర్మన్ పదవికోసం ఒక నామినేషన్ రావడంతో ఎన్నికల అధికారి శ్రీరాములు అధికారికంగా ప్రకటించారు. అనంతరం నూతన చైర్మన్‌కు ఎన్నికల అధికారి నియామక పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో రఘునందన్‌రావు, తదితరులు ఉన్నారు.

అధ్యాపకుల నిర్లక్ష్యంతో విద్యార్థులకు నష్టం

నాగర్‌కర్నూల్‌రూరల్: ఇంటర్‌బోర్డు అధికారుల నిర్లక్ష్యం కారణంగా ఇంటర్ ప్రశ్నాపత్రాల వాల్యుయేషన్‌లో దొర్లిన తప్పుల వల్ల విద్యార్థులు నష్టపోయారని మెరిట్ విద్యార్థులకు తీవ్ర నష్టం జరిగిందని బీఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షుడు కే రామకృష్ణ బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. మొదటి సంవత్సరంలో వచ్చిన మార్కులు ద్వితీయ సంవత్సరంలో వచ్చిన మార్కులను పరిశీలిస్తే చాలా తేడాలు ఉన్నాయని తెలిపారు. ఇలాంటి సమస్యలు పునరావృతం కాకుండా అధికారులు చూడాలని కోరారు.

అభివృద్ధి పనులపై సమీక్ష



చారకొండ: మండల కేంద్రంలో ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి అధికారులతో సమీక్ష సమావేశాన్ని ఎంపీడీఓ ఇసాక్ హుస్సేన్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మండలంలోని ఆయా గ్రామాల్లో అభివృద్ధి, పెండింగ్ పనులు, ఉపాధి పనులు, తదితర వాటిపై గ్రామాల వారిగా నివేదిక ఇవ్వాలని కోరారు. అనంతరం ఎంపీడీఓ మాట్లాడుతూ పంచాయతీ అధికారులు నిర్లక్ష్యం వహించొద్దన్నారు. తాగునీటి, పారిశుద్ధ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. కూలీలకు పనులు కల్పించాలని అధికారులకు సూచించారు. సమావేశంలో ఎంపీఓ వెంకటేష్, ఏపీఓ లక్ష్మయ్య తదితరులు ఉన్నారు.

కొలతల ప్రకారం పనులు



వెల్దండ: జాతీయ ఉపాధి హామీ పథకంలో కొలతల ప్రకారం పనులు చేస్తే కూలీలకు గిట్టుబాటు కూలి లభిస్తుందని ఏపీఓ ఈశ్వర్‌జీ పేర్కొన్నారు. బుధవారం మండలంలోని మర్రిగుంతతండాలో ఉపాధి పనులను పరిశీలించారు. కుంటలో మట్టితీస్తున్న కూలీలను కొలతలను వేశారు. అనంతరం మస్టర్లను తనిఖీ చేశారు. కార్యక్రమంలో టీఏ, కార్యదర్శి, ఉపాధి హామీ సిబ్బంది తదితరులు ఉన్నారు.

సీపీఎం నాయకుడు రామచంద్రారెడ్డికి నివాళి



అచ్చంపేట రూరల్: సీపీఎం నాయకుడు రామచంద్రారెడ్డి వర్ధంతి సందర్భంగా బుధవారం ఆ పార్టీ మండల కార్యదర్శి మల్లేష్ నివాళులర్పించారు. మండలంలోని ఐనోల్‌లో ఆయన చిత్రపటానికి పూలమాల వేశారు. కార్యక్రమంలో నాయకులు మణిపాల్‌రెడ్డి, నిర్మల, చంద్రయ్య, వెంకటయ్య, చిన్నయ్య, హేమ్లా నాయక్ పాల్గొన్నారు.

కంటి వైద్య శిబిరం

వీపనగండ్ల: మండల కేంద్రంలోని ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రంలో బుధవారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరం 46 మంది పరీక్షలు నిర్వహించారు. వారిలో 37 మందికి కంటి ఆపరేషన్ల కోసం మహబూబ్‌నగర్ ఆస్పత్రికి తరలించారు.